# పాలతల్లి

కపిల కాశీపతిరావుగారు

రాత్రి పదిగంటలైనది. ఇంటిల్లిపాదీ భోజనాలు చేసి పనులు చక్కబెట్టుకుని పడుకున్నారు. రుక్మిణికిమాత్రం యెంతప్రయత్నించినా నిద్దరపట్టడము లేదు. పక్కలో పిల్లవాడు "కుంయి, కుంయి" లాడుతున్నాడు. తల్లి అటూ యిటూ కాస్త వత్తిగిలితే గంయ్యిమని యేడుస్తూ బాధపెడుతున్నాడు. ఓపక్కన పడుకుని చెయ్యి తలకింద యెత్తుబెట్టుకొని పిల్లవాడికి పాలిస్తూ, విసుక్కుంటూ, మూలుగుతూ అవస్థపడుతున్నది. చిన్నతనంనుంచీ ఒక్కర్తే, తను స్వేచ్ఛగా పడుకునేటందుకు అలవాటు పడ్డది. కాపరానికి వచ్చిన కొత్తలో తప్ప ఆమె భర్తకూడా ఈ విధముగా నిద్రాభంగముచేసి వ్యథపెట్టలేదు. మూడునెలలుపైగా పిల్లవాడు పుట్టినప్పటినుంచీ ఆ అమ్మాయి సుఖముగా నిద్రపోయిన పాపాన్ని పోలేదు.

గదిలో దీపం వెలుగుతూన్నది. తలుపులన్నీ వేసివున్నవి. గుమ్మంలో నులకమంచం వేసుకుని మడిగా ఒక తాటియాకు తలగడా తలకింద వుంచుకుని రుక్మిణి తల్లి నిద్రపోతూన్నది. తాను పడుకుంటే పిల్లవాడు యేడుస్తాడు. యేడిస్తే నిద్రపోయేవాళ్లు విసుక్కుంటారు. ఎందుకు వచ్చిన అవస్థో యిది అని ఆ యిల్లాలు రొష్టుపడిపోతూన్నది.

"ఏమిటే, అమ్మాయీ, ఊఁ, అల్లా ఆపసోపాలు పడతావూ, వొక్క నిమిషం కునుకు పోరాదూ" అన్నది వాళ్లమ్మ.

"నీకేం, చెబుతావు, కునుకో అంటే కళ్లు ముయ్యనిస్తేనా ?"

"ఎవరే ?"

"ఇంకా అడగాలీ ? బ్రహ్మరాక్షసి నీ మనమడే."

"అంతా అపరూపాలు పోతావే, పిల్లా! మేం యెవరం కనిపెంచలేదు ? ఎల్లాగైతే కన్నావు పిల్లాణ్ణి. కాస్త ఒత్తిగిలి నమలబెట్టి పడుకుంటే వాడే వుంటాడు వాడి ధోరణ్ణి."

"ఇంక బతకఖర్లే, పీల్చి పిప్పిచేసెయ్యడ మేనేఁవిటి, పాట్టేలుకు మల్లే కుమ్మెయ్యడమే? ఇదేం పిల్లాడోనమ్మా! అందరి పిల్లలూ ఇల్లాగే వుంటే చచ్చిపోరూ?"

"ఎన్నో కంతులు కోశానుగాని, నా కంతెంత నెప్పిలేదన్నాడు వెనకటి కోవైద్యుడు. అల్లావుంది నీ వైఖరి. తొలిమాలుకే యిల్లా గనుకుంటే యేడుకాన్పులెల్లా భరించానమ్మా నేను? మీరంతా యిల్లా యేడ్పించినవాళ్లే."

"పోదూ నీ కాన్పులుసరే నువ్వూ సరేనూ, వొక్క నిమిషం కదలడానికి వీల్లేకచస్తోంటేనూ. పొద్దస్తమానూ అయ్యగారి సేవే అయితే యెల్లాగ? ఇంకెందుకు పనికిరా అఖ్ఖర్లేదు మనుషులు?"

"ఔను పాపం దుంగలూ దూలాలూ ఎత్తలేక నలగిపోతోంది పిల్ల; పని తీరుబాటు లేక. పుట్టినన్నాళ్లకి పురుషు డెజ్ఞంచేశాట్ట."

"పిల్లికి చెలగాటం, ఎలుకలికి ప్రాణపోకట అన్నట్టుంది."

"ఓసి పిల్లా పోకులు పోకుమీ."

"నీకేమే, నుంచుంటే కళ్లు తిరుగుతాయి. ఊఁ నీరసం. రాత్రి కాస్త తమలపాకులికి సున్నంరా సి.త్యామంటే లేవలేక శోషచేత పడిపోయాను. అప్పుడు ముఖాన్ని యిన్ని చన్నీళ్లుకొట్టి తీసుకొచ్చి పడుకోపెడితే తెలివొచ్చింది. ఆయనికి కూడా నిద్రలేదు పాపం."

"ఆఘాయిత్యపుపనులూ, తెలివితక్కువ పనులు చేస్తే సోషస్తుందా మరింకేమన్నా అవుతుందా? పిచికపిట్టలాగ బుర్రూబుర్రూమని తయారవగానే సరేనా, సంబాడించుకునే శక్తి ఉండాలి."

"ఎవరేం చేశారే? వూరుకున్నకొద్దీ మరి మితిమీరిపోతూంది ఉపన్యాసం. ఇంకముఖాలు ముఖాలు చూసుకో అక్ఖర్లేదు. ఎల్లాగైతే కలిగింది సంపత్తి; పిల్లలూ, పీచులూనూ. రెండురోజులు శలవు దొరక్క దొరక్క దొరికితే. పాపం! ఆయనేం చేశారు? ఈ రెండుపూటలు గుర్రాలకళ్లాగ మూతి ముడుచుకుని కూచోమన్నావేమిటె. ఎన్నాళ్లో?"

"నేనేంవన్నానే నువ్వల్లా ఖంగారు పడతావూ. మీ మీ యిష్టాలు నాకెందుకు బాబూ! బుద్ధితక్కువై కలగజేసుకున్నాను. ఉట్టికట్టుకుని వూరేగండి. కట్టుకట్టుకుని గంగలో దిగండి. ఈమాటు మూలిగితే చూడు చెబుతా."

............................................

"అమ్మా!"

"........."

"అమ్మా!"

"ఏం తల్లీ."

"నిద్రపోనివ్వడం లేదే."

"ఇల్లాతే అమ్మా, నేనన్నా పక్కలో వేసుకు పడుకుంటాను కానేపూ. తెల్లవార్లూ బిడ్డ కోడికూసినట్టు కూస్తోంది, ఒక్క కునుకు లేకుండా. అర్భకపు పిల్లలూ, అర్భకపు బతుకులూనూ. ఏం బతికి బట్ట కడతారో?"

"అమ్మయ్యా, బతికాను, బాబూ."

"ఇంక పాలతల్లిని రాత్రికూడా రమ్మని చెబుతానుండమ్మా. ఇక్కడే పడుకుంటుంది అది కూడానూ. ఇంకో ఒకటో రెండో ఎక్కువడిగితే అడుగుతుంది. ఏం చస్తాం? హూనం అయిపోతోంది పిల్ల. వెధవ పిల్లలు, వెధవ అవస్థాను. ఒకరోజా రెండురోజులా?"

ఉదయం ఏడుగంటలైనది.

పాలతల్లి అప్పుడే వచ్చి పిల్లవాడికి పాలిస్తూ ఉయ్యాలగదిలో కూర్చున్నది. రుక్మిణి తండ్రి వసారాలో పడక కుర్చీలో పడుకొని వెండి కళ్లజోడు పెట్టుకుని పంచాంగం తిరగవేస్తున్నాడు. ఒకసారి పుస్తకంచూసి, చూరుకేసి చూసి తలతడుముకున్నాడు. పెదిమలు ముడిచి విరిచినాడు.

"అమ్మాయీ" అని పిలిచినాడు.

"ఎందుకు నాన్నా?"

"ఇల్లా రా."

రుక్మిణి వచ్చి గడపలో నుంచుని "ఏం, ఎందుకూ?" అన్నది.

"నీ వంట్లో ఎల్లా వుంది?"

"నా వంటికేం, నిమ్మళంగానే ఉంది" అంది, ఒకపక్కకు వొరిగి ద్వారబంధానికి ఆనుకొని.

"మీ ఆయన ఏంచేస్తున్నాడు?"

"ఫలహారం."

"ప్రయాణం?."

"మధ్యాహ్నం."

"ఎవరెవరూ?"

"ఎమో, నాకేం తెలుసు, నన్నడిగితే?"

"మరి, ఎవర్ని అడగాలి?"

"అడగవలసిన వాళ్లనే అడగండి. నాకేం తెలుసు?" అని వెళ్లిపోవడానికి సిద్ధపడితే "ఇదిగో, ఇల్లా రా, వెళ్లిపోకు" అన్నాడాయన.

"అక్కడ ఫలహారం చేస్తున్నారు. ఎందుకు?"

"ఈవేళా, రేపూ మంచిదికాదు. ఎల్లుండి బయలుదేరితే దివ్యంగావుంటుంది. అందులో పిల్లతల్లిని తీసుకువెళ్లడం."

: "నాతో చెబితే? ఆయనతోనే చెప్పాసంగతి."

"ఏమిటి చెప్పే సంగతి, నేనొక్కణ్ణే ప్రయాణం. ఇప్పుడేం కంగారుపడి పంచాంగాలు తిరగెయ్యక్ఖర్లేదు" అంటూ అల్లుడు వసారాలోకి వచ్చినాడు. రుక్మిణి మూతివిరిచి, నవ్వుకుంటూ, వెళ్లిపోయినది. మామగారు ఏమీ మాట్లాడకుండా లేచి, ఏదో పనిమీద అవతలికి వెళ్లిపోయినారు.

పాలతల్లి వళ్లోపిల్లవాణ్ణి తీసుకుని రుక్మిణి వసారాలో కూర్చున్న భర్తగారి వళ్లో కూర్చోవేసినది. తాను స్తంభాన్ని ఆనుకుని, తండ్రీ కొడుకుల ముచ్చట్లు చూస్తో నుంచున్నది. ఆవిడముఖముమీద అపరిమితమైన ఆనందం తాండవిస్తున్నది. శరీరం అంతా తేలిక అయిపోయినది. పిల్లవాడు కళ్లుమూసుకుని నిద్రపోతున్నాడు. రామారావు, ఇంక విధిలేదురా బాబూ కాసేపు ఎత్తుకోకపోతే, అని మనస్సులోవున్న అసహ్యాం అంతా అణుచుకుని వెగటుగా పిల్లవాణ్ణి చూస్తున్నాడు.

"ఉచ్చోస్తాడేమోనే తీసెయ్యి" అన్నాడు. రుక్మిణికి చాలా కష్టం తోచినది. "ఒక మాటు ముద్దన్న పెట్టుకోరు. పాపం!"అని సత్తుముఖం వేసి నుంచున్నది. పోనీ దీనితోటన్నా వొదులుతుందని అతను అలవాటు లేనివాడు చుట్టకాల్చినట్టుగా ముద్దుపెట్టుకున్నాడు. వెంటనే గుడ్డతో మూతి తుడుచుకొంటూంటే "మరీ శొద్దెమండీ, మీరు"అని పిల్లవాణ్ణి తీసుకుని "మా నాన్నేడీ, చిట్టేడీ, బుల్లేడీ, నాన్న దగ్గిర కొల్లిందా, పిచ్చిముండా, ఏం వన్నాలమ్మా నాన్ననిమ్మా, వుచ్చోత్తా వన్నారా, కొట్టుదామా, నాన్నని కొట్టుదామా" అని అనురాగ మహాంబుధిలో, తుపానులో ఓడమాదిరిగా ఊగిపోతూన్నది. "నీచువాసనేస్తాడేమే, వెధవ?" అన్నాడా చిట్టి నాన్న, ఇంత అవస్థా పడినతరువాత. రుక్మిణికి చాలా కోపం వచ్చినది. "ఉప్పరిదాని పాలు తాగుతున్నాడు. వుప్పరి వెధవ" అన్నాడాయన. ఆమెకు మరింతకోపం వచ్చినది.

..............................................

..............................................

"పొద్దెక్కుతోంది, పిల్లాడికికాస్త నీళ్లొయ్యవుటే, అమ్మాయి?"

"పడుకున్నాడే పాపం. లేపితే ఏడుస్తాడు ఎల్లాగు?"

"అయితే, యీవేళ వొళ్లు కడగవేంవిటి వాడికి?"

"నా చేతకాదు బాబూ, కావలిస్తే నువ్వే పొయ్యి."

"ఏం, విడ్డూర్యాలే, మాయమ్మతల్లీ, పడుకుంటేవో అపురూపం, పడుకోకుండా మేలుకుంటేవో అపురూపం."

"అమ్మా, ఇదివరకు అల్లా ఏడ్చేవాడు, ఇప్పుడల్లా నిద్రపోతాడేమే. మూడోనెల వొచ్చినకాణ్ణించి మానేశాడు. నెలకోవైఖరి అయ్యగారికి."

"పిల్లలికి నిద్రే సఘుంబలంట. ఇదివరకు కడుపు ఎండగట్టి పడుకోవేస్తే ఏడ్చేవాడు. ఇప్పుడు కడుపునిండి శుభ్రంగా నిద్రపోతున్నాడు. నా చిట్టి తండ్రి" అని నిద్రపోతూన్న పిల్లవాణ్ణి తీసుకుని ముద్దుపెట్టుకున్నది ముసలావిడ. బద్ధకంలోవున్న పిల్లవాడు నిద్రలోకూడా పాలుతాగుతూన్నట్టు పెదిమలు ఆడిస్తూ నాలిక చప్పరిస్తున్నాడు.

"పాలు తాగుతున్నాడు చూశావుటే అమ్మా నిద్దట్లో. కలగంటున్నాడేమోనే?"

"పిల్లలంతా అంతేనే."

ఇంతలో పిల్లవాడు మేలుకుని తన చిన్నవొళ్లు విరుచుకుంటూ, బుల్లినోరు తెరిచి ఆవులించినాడు. "చూడవే, అమ్మా, చూడవే" అన్నది రుక్మిణి. పిల్లవాడు బుగ్గలు సొట్టపడుతూ నవ్వినాడు.

"ఎందుకే నవ్వుతాడల్లాగ?"

"దేవుడు చంటి పిల్లలికి కల్లో కనబడతాట్ట,కనబడి మీ అమ్మా మీనాన్నా కాశీ లేచిపోయారంటాట్ట. అంటే వాళ్లేడుస్తారు. మళ్లీ అదుగో వచ్చారంటాట్ట. వెంటనే నవ్వుతారు. వాళ్లకేంవిటి చంటిపిల్లలు దేవుడితో సమానం" అంటూ పిల్లవాణ్ణి నీళ్లుపోయడానికి పెరట్లోకి తీసుకు వెళ్లిందామె. రుక్మిణి, తల్లీ కూడా వెళ్లి రుబ్బురోలుమీద కూర్చుని చూస్తున్నది.

"ముచ్చట చూస్తూ కూచోకపోతే కాస్త అందివ్వకూడదూ? అంత అబ్బరాలే, తల్లీ,యీకాలపు పిల్లలూ."

రుక్మిణి వినిపించుకోనట్టు ఏదో మాట్లాడుతున్నది.

"ఇంకెన్నాళ్లమ్మా, లెక్కపెట్టి ఇరవయి రోజులు, తరువాత నా అవస్థ నేనే పడతాను."

"అవునమ్మా, నీకవస్థకాకేం, కుర్రాడి గడ్డికుర్రాడు తింటాడు. నీ పెంపూ, నీ పెట్టూ, వాడు బాగుపడకేం? నీ ధోరణి నీది వాడి ధోరణి వాడిది."

"ఇక్కడ దిగబెట్టిపో, నాదగ్గిరె వుంటాడు వాడు. మగపిల్లల్ని పెంచి చాలా రోజులైంది. వాళ్ల తాతయ్య యెంతో మురిసిపోతున్నారు. ఏంవుందమ్మా, ఇక బుట్టె బిడ్డలా, ఇక పెరిగే బాలలా. సూర్యాస్తమయం అయిపోతూంది" అని ఆవిడ, స్తంభించిన కంఠంతో, నీరు గ్రక్కిన కండ్లతో గతించిన సర్వసౌభాగ్యములూ తలుచుకొని, శేషించిన వార్ధకానికీ, జీర్ణించిన శరీరపటుత్వానికీ చాలా విచారించినది.

"ఇంకా ఏ మాశే, కాటికికాళ్లు చాచుకుని కూచుని, యింకా పిల్లలు కావాలని ఉవ్విళ్లూరుతోంది, అమ్మగారు. నవ్విపోయారు, ఎవరన్నా వింటే. సిగ్గు చేటు."

"అవునమ్మా, వేళాకోళం అయిపోయింది మా బతుకు. ఇంతకీ మా చిట్టినాన్నని ఇక్కడ వుంచుతావా వుంచవా?"

"నా యిష్టం ఏం వుందమ్మా, వాళ్ల నాన్నని అడుగు. నీకే అపేక్షా మనమలంటే? వాళ్ల బామ్మకి లేదూ?"

"ఇదంతా యెందుకు, శ్రీరంగనీతులు. వుంచనని చెప్పరాదూ. అల్లా వుంటుందిగావునమ్మా యెవరిపిల్లలంటే వాళ్లకి" అంటూ ఆవిడ పిల్లవాడికి నలుగు పెడుతూన్నది.

"అదేంవిటే, అల్లా నలిపేస్తావు, వాణ్ణి చూడు పాపం, వొళ్లంతా ఎల్లా కందిపోయిందో. ఇదే గావును పెంపు. నీ పెంపూ, సొంపూనూ."

"నక్కపుట్టి, మూడు ఆదివారాలైందట. ఇంత వుప్పెన యెప్పుడూ యెరగనందట. అల్లావుంది నీమాటా, వేషం. నువ్వుకూడా చెప్పాలీ నాకు, పిల్లల సంరక్షణ. లేక లేక పిల్లబుడితే గడ్డపారతో ముక్కు కుట్టినట్టుంది. అబ్బరం! నువ్వే పిల్లాణ్ణి గన్నావు. అసలల్లా నలిస్తేగాని పిల్లలు బలంగా వుండరు" అని మరి కాస్త దృఢంగా నలిచినది. పిల్లవాడు ఏడ్చినాడు.

"చూడవే, పాపం, చూడవే, నెమ్మదిగా నలవ్వే."

"అరిగిపోడు లేవే ఇంతలో నీకొడుకు. అరగనీ, కాస్తతాగిన పాలన్నీ. ఆ పాలతల్లి వొళ్లోజేరి తెగతాగుతాడా పాలన్నీ."

"ఊరుకోవే, దిష్టి తగుల్తుంది. మనమే అనుకుంటే పూర్లోవాళ్లేంవంటారు?"

"అనుకోరు మరీ. అది గోల, పాలన్నీ మీ అబ్బాయే తాగుతున్నాడు, మా పిల్లకేం మిగలవని."

"అమ్మా, వాళ్లేం తింటారే, అంతబలంగా వుంటారు. ఒక పిల్లాడికే మనం ఇల్లా అనుకుంటాం గదా, ఇద్దరికీ కూడా ఎల్లా యిస్తోందో అది?"

"వాళ్లు కాయకష్ట పడతారు. వేళకింత కలో గంజో తాగుతారు."

"మనయింట్లో మనిషి మకీనే. దీనమ్మ కడుపు బంగారం గానూ, నల్లరాళ్లు. అనుకోకూడదుగాని పాపిష్టి మాటలు, ఆవుపాదుగో, గేదిపాదుగో అనిపిస్తుంది." అని చెంపలు వాయించుకొన్నది.

"సరిగ్గా చూడలేదులే యెప్పుడూ నువ్వూ, యీ వొడ్డుప్పరాళ్లంతా అంతేనే. వాళ్లకి ఆ పటుత్వం స్వతహా వుండనూ వుంటుంది, పైగా మీకుమల్లె దిక్కుమాలిన ముష్టి షోకులన్నీ యెరగరు వాళ్లు. మా కారులో, మేము అల్లాగే వుండేవాళ్లం. నాకార్యానికి మా అత్తారు బణారసు రవికె పట్టుకొస్తే, తొడుక్కునే సరికి జేబుల్లో గుడ్డ చాలక పిగిలిపోయింది రవికె. అప్పటికి నాకు పదమూడేళ్లు. ఇప్పటికి మళ్లేనా, అసలు ఈ కారుకారంతా అంతే. తినలేరు, తింటే హరాయించుకోలేరు."

"మరి మనం కూడా యింత తింటాం గదా, ఈ నీరసం యెందుకే."

"అదుగో, అల్లారా; దీనికికారణం అసలీ దిక్కుమాలిన ఫ్యాక్టరీ బియ్యం. ఇవి లేక మునుపు, తలనెప్పి

ఏటువంటిదో యెరగం. సుభ్రంగా దంపుడు బియ్యం వండుకుతిని మూడుపూట్లా, యింటిడి పనీ చెయ్యి చూద్దాం. ఎక్కడుంటుందో నీరసం. నీరసం గీరసం, యెగిరిపోవాలి. పదిరోజులల్లా చేశేసరికి యెల్లా తేల్తావో మనిషివి,దొనదొన లాడుతూనూ, ఆశ్చర్యంవేస్తుంది నీకే, యెంతో వోపికొస్తుంది. ఇదుగోనమ్మా పిల్లాణ్ణి తీసుకో, మంచుమీద నూనెట్టి,బొట్టెట్టి కాటుకెట్టి పడుకోవెయ్యి."

భోజనాలు అయిన తరువాత రామారావు ప్రయాణం సాగించినాడు. వెళ్లడానికి సిద్ధంగా సావిట్లో కుర్చీలో కూర్చున్నాడు. రుక్మిణి పక్కన నుంచొని తమలపాకులికి సున్నంరాసి యిస్తూన్నది. కింద తుంగ చాపమీద పిల్లవాడు బోర్లపడుతూ, కాళ్లూచేతులూ కొట్టుకొంటూ, నోటితో బుడగలేస్తున్నాడు.

"ఇదుగో, మీరిప్పుడెళ్లకండి."

"ఏం?"

"వానొస్తుంది."

"నీ కెల్లా తెల్సు?"

"అదుగో చిట్టిగాడు బుడగలెయ్యటం లేదూ, చంటి పిల్లలు బుడగలేస్తే వర్షం వొస్తుందిట."

ఇంతలో పిల్లవాడి తాతగారు అక్కడికి వచ్చి "పిట్ట కూతపట్టిందే" అన్నారు మనుమణ్ణి చూచి. అని తండ్రి అందుకుని, "పాతక పందిలా బలుస్తున్నాడు వెధవ" అన్నాడు.

"పోదురూ మరీనూ, దిష్టిగుణాలు దిష్టిమాటలూనూ. దానికేంగాని, నేను చెప్పినమాట జ్ఞాపకం వుంటుందా? ఉండదా? మేం జ్ఞాపకంవుంటాం, అక్కడికి వెళితేను."

"ఏం చెప్పావు నాతోను, జ్ఞాపకం వుండడానికి?"

"ఊఁ పోకండీ, పాలతల్లి సంగతి."

"నాకు వేళైంది. నీతో కూర్చుంటే రైలందదు." అని లేచినాడు.

"వెడుదురుగాని, వెళ్లకపోతారేంవిటి? నా మాటకి జబాబు చెప్పరేం?"

"ఏంవని చెప్పమన్నావు?"

"పాలతల్లిని కుదిర్చి,కుదరగానే వుత్తరం వ్రాస్తే వస్తాను. ఇదుగో తరవాత మీ యిష్టం. అత్తయ్యతో చెప్పండి నే చెప్పాననీ, ఆవిడికి తెలుసునులెండి. ఏం?"

"సరేగాని, టైము చూడు ఎంతైందో."

౨

రుక్మిణి పిల్లవాణ్ణి తీసుకుని అత్తవారింటికి వెళ్లినది. ఆమెకు ఇంకా శరీరంలో నీరసంగానే వున్నది. తత్కారణముగా భార్యాభర్తల అన్యోన్యముకు కొంత లోపము కలిగినది. పిల్లవాణ్ణి ఆమె జాగ్రత్తగానే చూచుకొంటూన్నది. మంచి దృఢమైన వయస్సులో వున్న మనిషినే పాలతల్లిగా కుదిర్చినారు. పిల్లవాడు అక్కడకంటె ఇక్కడ బాగున్నాడని రామారావు అభిప్రాయం. కాని రుక్మిణి ఆ మాట ఒప్పలేదు. కానైతే పాలిచ్చేమనిషికి యిక్కడే రెండురూపాయిలు యెక్కువ ముగుతూవున్నది. "ఎందుకండి అంత డబ్బు?" అంటే రామారావు "పోన్లెద్దూ" అన్నాడు. ఆ మనిషి పక్కింటి వారితో, "అమ్మగారికంటె అయ్యగారే మంచివా" రని చెప్పినది. ఆసంగతి రుక్మిణి చెవుల బడినది. ఆమెకు చాలా కోపం వచ్చినది. ఆ మనిషిమీదే కాక, భర్తమీద కూడా చాలా ఆగ్రహం వచ్చినది తలపురాని వూహలు చాలా ఆమెకు తట్టినవి. ఇదివరకు మాదిరిగా రామారావు తన కూడాకూడా తిరగడము లేదని ఆవిడకు యిదివరకే మనస్సు కష్టం తోచినది.

ఒకరోజున రుక్మిణి దొడ్లో ఎదో పనిచేసుకొంటూన్నది. రామారావు భోజనంచేసి కచేరీకి వెడుతూ యెందుకో ఆమెను పిల్చినాడు. రుక్మిణికి వినబడక పలుకలేదు. తొందరచేత గదిలో పిల్లవాడికి పాలిస్తున్నమనిషిని పిల్చి అమ్మగార్ని పిలవమన్నాడు. ఆ మనిషి ఆ యాజ్ఞ శిరసావహించినది. రుక్మిణి రుసరుస లాడుతూ వచ్చి "గట్టిగా పిలిస్తే పలకనూ" అని సాధిస్తూ కోర చూపులతో అతన్ని చూసినది. అతను గుమ్మందిగగానే "రాయబారాలు రాయబారాలు" అని గొణుక్కున్నది. అది అతను వినలేదు.

ఇంకొకరోజున వీధిలోకి వెడుతూ, ఎండగా వుంటే, వెనక్కు వచ్చి, "గొడుగు" అని కేకవేస్తే ఆ మనిషి తీసుకువెళ్లి యిచ్చినది. అది రుక్మిణి చూసి "ఏ అమ్మా, నీపని నువ్వుచూసుకో, పిల్లాణ్ణి విడిచిపెట్టి, పెత్తనాలుచేస్తా వెందుకు" అని, ఆ సంగతి మనస్సులో పెట్టుకున్నది.

మరోమాటు గదిలో పిల్లవాడు పాలతల్లి దగ్గిర పాలు తాగుతున్నాడు. రుక్మిణి యింట్లోవున్నది. రామారావు వెళ్లి ఆ అమ్మి వొళ్లో పిల్లవాణ్ణి ఆడిస్తున్నాడు. రుక్మిణి అధాత్తుగా ఆ గదిలోకి వచ్చినది. చూసి గిరుకున తిరిగి వెళ్లిపోయినది. దొడ్లోకి వెళ్లి, "నారాయణ, నారాయణా, మరీ వొస్తోంది, ఆనాటి కానాటికి, కళ్లారాచూస్తో ఎల్లాగ వూరుకోడం." అని రుంజుకున్నది.

ఇల్లావుండగా కొద్దిరోజుల్లో పిల్లవాడి నోరంతా వొరిసి ఎర్రగా పుండుమాదిరిగా అయిపోయినది. డాక్టరుగారిని పిల్చినారు.

"ఏంపాలిస్తున్నారండి" అని అడిగినా డాయన పిల్లవాణ్ణి చూసి.

"ఎవరో, శూద్రమనిషిని పెట్టి పని జరుపుతున్నాం, ప్రస్తుతం ఏంచేస్తాం?" అన్నాడు రామారావు.

"అనుకున్నాను." అన్నాడు డాక్టరు.

"ఎందువల్ల?"

"చూశారూ, సాధారణంగా చంటిపిల్ల తల్లి పత్యం చెయ్యాలంటారు మనవాళ్లు. వాళ్లు వూరికే అనలేదు ఆసంగతి. పాలిచ్చేతల్లి ఆహారాన్ని, శరీరావస్థని పట్టి వుంటుంది పిల్లల ఆరోగ్యం. పైగా, ఈ అలగాజనంమనుషుల్ని మనం కుదర్చడమేగాని, వాళ్లు సాధారణంగా పాడుతిళ్లన్నీ తింటారు. పైపెచ్చు, వాళ్ల శరీరంలో అనేక జాడ్యాలు వుంటవి." అని యేమేమో చెప్పి ఆయన వెళ్లిపోయినాడు.

ఇంతకూ తేలిన పర్యవసానం ఏమిటీ అనగా, డాక్టరుగారు చెప్పిన మాటమీదనైతే నేమి, రుక్మిణికి అదివరకేవున్న అనవసరమైన అసూయచేతనైతే నేమి పాలతల్లికి ఉద్వాసన చెప్పినారు.

ఆరోజుమొదలు పాలతల్లులు ఎవరూ ఆగుమ్మం ఎక్కలేదు. కాని సీమదేశమునుంచి, మనదేశానికి దిగుమతి అయేటటువంటి "చేతితో తాకబడని శిశ్వాహారము"ల సీసాలు, డబ్బాలుమాత్రము చాలా ఆయింట్లో గూళ్లలో చేరినవి.

## 3

పిల్లవాడికి రెండేళ్లు దాటినవి. నడుస్తో, ఎగురుతో గంతులు వేస్తున్నాడు. ఏడాది నిండకపూర్వమే అన్నప్రాశన చేసినారు. అప్పటినుంచీ కాస్త అప్పుడప్పుడు జ్వరం రావడం ప్రారంభించినది. కాని చలాకీగానే ఆడుకుంటూ వుండేవాడు. కొంచెం దుండగీడుగానే వుండేవాడు.

ఓమాటు దొడ్లో కాకి గుడ్డిపేతని పడవేస్తే, అది తీసి నాకుతూండగా వాళ్ల బామ్మచూసి, అదిలాగేసి, కుర్రవాణ్ణి స్నానంచేయించి, తాను స్నానం చేసినది.

దాసీదానికొడుకుతో ఆడుకునేవాడు. దాసీదాని కొడుకు యింటివద్దనుంచి తెచ్చుకున్న ఉప్పు చేపముక్కలు నేస్తగాళ్లు యిద్దరూ ఫలహారం చేశేవాళ్లు. పిల్లవాడు ఆటవస్తువులు దాచుకునే అట్టపెట్టిలో అప్పుడప్పుడు కోడిగుడ్డు డొలకలు దొరుకుతూ వుండడం కద్దు.

ఇవన్నీ చూసి వాళ్లనాన్న "శూద్రపాలు తాగి శూద్రవెధవలా అయిపోయా" డని తిట్టేవాడు. రుక్మిణికి విపరీతమైన కోపం వచ్చేది.

రామారావు స్నేహితులు చలాకీగా పుష్టిగావున్న కుర్రవాణ్ణి చూసి చాలా సంతోషించేవారు. చిట్టినాన్న కూడా కొత్తలేకుండా అందరిదగ్గిరకూ వచ్చేవాడు. వాడిమాటలు మాత్రం మామూలు చంటిపిల్లల యాసమాటలే కాక కొంచెం శూద్రపద్ధతిని కూడా వుండేవి. కొద్దిగా తగుమాత్రం, అవసరార్థమై కావును తిట్లుకూడా జాగ్రత చేసినాడు. పెద్దమనుష్యులకు పలుకరింపరాని

వాడు. నిరంతరమూ బూడిదలోనూ మట్టిలోనూ ఉండుటజేసి పరమశివునితో సమానుడు.

ఒకనాడొక స్నేహితుడు చూసి "ఏడేమిట్రా మీ యువరాజు? ఉట్టి బూడిద బుస్సన్నలా వున్నాడేం?"

"వాడేగాని, నీమర్యాదకాపాడుకో దలుచుకుంటే, వాడి జోలికి వెళ్లకు; బహుదుష్టుడు. వాడికి దూరంగా వుండడం ఉత్తమం. వాడిది బ్రాహ్మణ కుటుంబంలో శూద్ర జన్మ. మత్స్యమాంసాదులు అవలీలగా తింటాడు. నోరువిప్పితే బూతుల పంచాంగం. తరువాత నీయిష్టం." అన్నాడు రామారావు.

ఇంకో స్నేహితుడు "అదేమిట్రా, రాముడూ, వాడి పొట్టల్లా వుంది బానలాగ" అన్నాడు.

"బల్లట్రా, కడుపులో."

"వెధవపిల్లన్నీ, గ్లాకోస్ అని అవని ఇవని పెడితేనూ" అన్నాడొక అనుభవజ్ఞుడు.

"ఏమోరా, ఏంకర్మమైనానూ?"

"కర్మం ఏంరా, నీపనే బాగుంది ఎంచక్కగాను. ఓ కొడుకు కడుపులో బల్ల, యింకో కొడుకు కడుపులో కుర్చీ, కూతురు కడుపులో మంచం, నువ్వింకో సామాను చేయించుకో అక్ఖర్లేనూ" అన్నారొకరు. ఈ సంభాషణ అంతా రుక్మిణి పక్కగదిలోంచి విన్నది.

రాత్రి భోజనాలవేళ "పిల్లాడేడీ?" అన్నాడు రామారావు.

"మీరేం పిలవక్ఖర్లేదు; శూద్రపిల్లాడుగా, వాళ్ల శూద్ర తల్లితోనే తింటాడు" అన్నది రుక్మిణి.

"శూద్ర బుద్ధులుంటే శూద్రవెధవ కాడూ."

"పోన్లెండి, మీ బ్రాహ్మణ్యం మీరు కాపాడుకోండి."

భోజనం చేసి రామారావు కాసేపు అటూ యిటూ తిరిగి గదిలోకి వెళ్లి పండుకొన్నాడు. ఎంతసేపటికీ రుక్మిణి రాలేదు. భోజనాలు అయిపోయినవి. పిల్లవాడు వాళ్ల బామ్మదగ్గిర పడుకొన్నాడు. రుక్మిణి నడవలో చాప మీద పడుకొన్నది. రామారావు విసుగుపుట్టి "తామల పాకు లెక్కడున్నాయే" అని పిలిచినాడు.

జబాబు లేదు.

పదినిమిషాలు జరిగినది.

"మంచినీళ్లు."

ఎవరూ పలుక లేదు.

లేచి అలమార్లన్నీ చప్పుడు చేస్తూ ఏదో వెదుకడం మొదలుపెట్టినాడు.

"అబ్బ! తల నొప్పిగావుంది. అమృతాంజనం ఎక్కడ పెట్టావ్?"

పలుకు లేదు.

"అమ్మాయి, ఎందుకో పిలుస్తున్నాడే, అబ్బాయి" అన్నది అత్తగారు, రుక్మిణిని హెచ్చరిస్తూనూ.

"ఏంవిటే" అని బద్ధకం నటిస్తూ అటు వొత్తిగిలి పడుకొన్నది రుక్మిణి.

"అమృతాంజనం సీసా కావలిటే, తలనొప్పిగా వుందిట."

రుక్మిణి మూలుగుతూ లేచి గదిలోకి వచ్చి అమృతాంజనం వెదికి తెచ్చినది.

"ఇదుగో."

"ఏంవిటి?"

"అమృతాంజనం కావా లన్నారుగా!"

"తొందరేం?"

"అబ్బ! నిద్రొస్తోంది."

"వొస్తే పడుకో."

"ఇది తీసుకోండీ."

తీసుకోబోతూ రామారావు రుక్మిణిచెయ్యి పట్టుకొన్నాడు.

"శూద్రదాన్ని ముట్టుకోకండి" అన్నది చెయ్యి లాక్కోబోతూనూ. అతను విడిచిపెట్టలేదు. రుక్మిణి కళ్లలో నీళ్లు తిరిగినవి..

"సంతోషించార్లే తెలివికి."

"మరెందు కేంవిటి, అందర్లో అల్లా అనడం?"

"శూద్రవెధవని అంటే కోపం యెందుకూ?"

"శూద్రబిడ్డ తల్లీ శూద్రే, అయితే; తండ్రికూడానూ, మళ్లీ మాట్లాడితే."

"వుప్పరిదాని దగ్గిర పాలు తాగుతే అంతే."

"చంటి పిల్లలకేనా ఆపట్టింపు, పెద్దవాళ్లకి కూడానా?"

"అది కాదోయి వేడిచెవురూ."

"వేడిచెవుటే మరి, స్నేహితులంతా కన్నబిడ్డని అల్లా అంటోంటే వూరుకోడం."

"ఏంవన్నారు?"

"బల్లలు, కుర్చీలు."

"నిజం చెబితే నిష్ఠూరంట."

"గ్రహచారాని కేంచేస్తాం వేంవిటి?"

"నీమొహం, పాడు డబ్బాలలో పిండంతా వాడి పొట్టలో వేస్తే ఏమవుతాడు?"

"పోన్లెండి. ఏం వెక్కిరిస్తారు? మనిషిని పెడితే వో అవస్థ. దాని యిబ్బందులు దానికి. డబ్బాపాలు పోస్తే, యీ అవస్థ. మరెల్లాగండీ?"

"మనపూర్వులంతా డబ్బాపాలే తాగి బతికారా? వాళ్లు 'అమ్మాబాయే' అని యేడ్చారా, 'అమ్మా, డబ్బా బాయే' అని యేడ్చారా?"

"పోన్లెండి, చమత్కారపుమాటలూ మీరూనూ, మీకు యెదురు చెప్పగలరూ, యెవరన్నా. ఈమాటొద్దులెండి; పాలతల్లీ వొద్దు, డబ్బాలు వొద్దు. పోతే నేనే పోతాను? మీబిడ్డ బాగుంటే సరిగదా మీకు. తొందరెందుకు? ఆర్నెల్లు వోపికపడితే ఆమనుసులూ తీర్తాయి."

"ఇప్పుడు తీరినవి చాలవూ? ఇంకా తీరాలీ?"

"పోనీ, మీ రల్లా అంటారు గాని నే నెందులో విన్లేదు చెప్పండి మీమాటా? ఓమాటు బుద్ధి పొరబాటైంది; యికముందు దిద్దుకుంటాం. సరిగదా?"

"సరే లే; టైము చూడు."

"పదిన్నర అయిందిగానీ, తమలపాకులు యెగురుగుండా బల్లమీద పెడితే, అల్లా కేకలేశా రెందుకు?"

"అక్కడ పెట్టినవాళ్లకోసం."

